## పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

**యాచారం, జులై 22 ప్రభాతవార్త :** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023-24 సంవత్సరంలో పండ్ల తోటల పెంపకానికి గాను ఆసక్తి గల రైతుల నుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడివో విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, ఐదెకరాల్లోపు ఉన్న పట్టాదారులు, ఉపాధి జాబ్ కార్డు కలిగి బోరు, బావి కలిగి విద్యుత్ సౌకర్యం ఉన్న వారు పథకానికి అర్హులని ఆమె తెలిపారు. ఆసక్తి గల రైతులు ధరఖాస్తు ఫారంతో పాటు పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్‌లతో పాటు మూడు పాస్‌ఫోటోలు, గ్రామపంచాయితీ తీర్మానం తీసుకుని గ్రామపంచాయితీ కార్యదర్శి, ఎఈవో, ఎపీవోలకు సమర్పించాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు రైతులు ధరఖాస్తులు చేసుకోవాలనా న్నరు. రైతులకు మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, సపోట, ఆయిల్‌ఫామ్, బత్తాయి, అల్లనేరేడు పండ్ల మొక్కలను అందజేస్తారని. 1-3 సంవత్సరాల వరకు యాజమాన్యం డబ్బులు ఉపాధి హామీ పథకం నుండి అందజేస్తారని తెలిపారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# సదుపాయాలు లేని కేంద్రాలను గుర్తించి నివేదికలు సమర్పించాలి

### -జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**వికారాబాద్, జులై 22, ప్రభాతవార్త:**
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు,సదుపాయాలు లేని కేంద్రాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సమస్యాత్మక ,క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు,పోలింగ్ కేంద్రాల నూతన ప్రతిపాదనలు,మౌలిక సదుపాయాలు,ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు తదితర అంశాలపై తహశీల్దార్ ( ఏఇఆర్వో) సెక్టోరల్ అధికారులు, పోలీస్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు రాహుల్ శర్మ ,లింగ్యా నాయక్, ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవోలు విజయ కుమారి, శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో రాబోవు అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీటి సౌకర్యం, టాయిలెట్స్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవేని మరమ్మత్తులు, సమస్యలు ఉంటే సూచించినట్లయితే పనులు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.


వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశంలో వివిధ అధికారులతో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ సి,నారాయణరెడ్డి,

పోలింగ్ కేంద్రాల పేర్లు, కేంద్రాల స్థానికత మార్పు, శిథిలావస్థలో ఉన్న పోలింగ్ కేంద్రాలు, ర్యాంప్‌ల సౌకర్యం తదితర అంశాలను పరిశీలించాలన్నారు. ఓటర్లకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించాలన్నారు.1500 దాటిన ఓటర్ల పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు.అక్టోబర్ 1, 2023 వరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమెదు చేసు కునే అవకాశం ఉందని దానిపై దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు.సెప్టెంబర్ 19 లోపు మాన్యువల్, ఆన్లైన్ ద్వారా నూతనంగా ఓటర్‌గా నమోదు చేసుకునే అవకాశంఉన్నందున వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## చైన్ స్నాచింగ్ పాల్పడ్డ బావబామ్మర్దులు

- వారిని కటకటాల్లోకి పంపించిన బాలాపూర్ పోలీసులు
- ఇద్దరు నిందితులు, బంగారం కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్టు
- 16 తులాల బంగారం, 10 తులాల వెండి, పల్సర్ బైకులు, 1ఆటో, ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జులై 22, (ప్రభాతవార్త) :**
బంగారు గొలుసులు ధరించి ఒంటరిగా కనిపించే మహిళలే వారి టార్గెట్.. అలా కనిపిస్తే చాలు ఇలా చైన్ స్నాచింగ్ చేసేసి కంటికి కనిపించకుండా పారిపోయే ఓ బావబామ్మర్దిల ఆటలను బాలాపూర్ పోలీసులు కట్టేసి కటకటాల్లోకి పంపించారు..ఆ వివరాల్లోకి వెళితే...


నిందితులను, పట్టుకున్న సొత్తును మీడియాకు చూపిస్తున్న పోలీసులు

చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతూ జల్సాలకు అలవాటు పడిన ఓ బావబామ్మర్థిలను పోలీసులు పట్టుకొని శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న సయ్యద్ ఖాజా, అతని బామ్మర్ది షేక్ ఆరిఫ్, చిన్న (మైనర్)బామ్మర్ది ముగ్గురు కలిసి బిస్మిల్లా కాలనీ, వెంకటాపూర్, క్యుబా కాలనీ, అబ్దుల్లా నగర్ కాలనీలలో దొంతనాలకు పాల్పడి సంవత్సరం కాలంగా తప్పించుకొని తిరుగుతున్నారు. ఆయా కాలనీల్లో దొంగతనాలకు పాల్పడుతూ మొత్తం 21 దొంగతనాలు చేసి పోలీసులకు చిక్కకుండా పోలీసులకే సవాల్ విసిరారు. దీంతో బాలాపూర్ పోలీసులు ఈ కేసులను సవాల్‌గా తీసుకొని ఆయా కాలనీల్లో సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుల కదలికలను పసిగట్టి ఎట్టకేలకు వారిని పట్టుకున్నారు. ఇందులో ప్రధాన నిందితుడు సయ్యద్ ఖాజా ఉదయం వేళలో రెక్కి నిర్వహిస్తాడు. తరువాత రాత్రి వేళలో దొంగతనాలకు పాల్పడతాడు. ఇలాంటి దొంగతనాలు చేసిన రెండు పల్సర్ బైకులు, ఆటోలో ఇద్దరు బామ్మర్థులను ఎక్కించుకొని కాలనీలను మొత్తం రెక్కి నిర్వహిస్తారు. అనంతరం రాత్రివేళలో దొంగతనం చేసి వచ్చిన సొమ్మంతా ఇది బజార్‌లో ఉండే సిరాజోద్దీన్ అనే వ్యక్తికి విక్రయిస్తారు. ఇలాంటి దొంగతనాలకు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి దాదాపు 50 తులాల బంగారం, రెండు పల్సర్ బైకులు, 1 ఆటోను ఎత్తుకెళ్లారు. శనివారం నిందితులను అదుపులోకి తీసుకున్న బాలానగర్ పోలీసులు వారి వద్ద 16 తులాల బంగారం, 10 తులాల వెండి, రెండు బైకులు, ఆటోను స్వాదీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుల్లో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను మహేశ్వరం డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

## నారపల్లిలో ఘనంగా బొండ్రాయి పునఃప్రతిష్ఠ పూజలు


నారపల్లిలో బొండ్రాయి పున: ప్రతిష్ట పూజా కార్యాక్రమంలో పాల్గొన్న చైర్మన్ బి.కొండల్ రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 22, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ పరిధిలోని నారాపల్లిలో శనివారం బొండ్రాయి పున: ప్రతిష్ట పూజలు ఘనంగా జరిగాయి. బొండ్రాయి పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎం. సురేందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండటానికి అనాదిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులని అన్నారు. గ్రామస్తులంతా కలిసి బొండ్రాయి ప్రతిష్ట కార్యక్రమం చేపట్టడం సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు అబ్బవతి సరిత, మోటుపల్లి పోచమ్మ, రవీందర్, నాయకులు అబ్బవతి నర్సింహ, మోటుపల్లి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు ఎం.డి. అక్రం అలీ, స్థానిక నాయకులు ఎం. నరేందర్ రెడ్డి, పి. అయోధ్య, శ్రీరాములు, తల్లపల్లి పరుశురాం, మీసాల సురేశ్, గ్యార ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకే అవిశ్వాసం

### -ఎంపీటీసీ సరితపంతునాయక్


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిటీసీ సరితపంతునాయక్

**ఆమనగల్లు, జులై22, ప్రభాతవార్త:**
ఆమనగల్లు మండల పరిషత్ చైర్ పర్సన్ (ఎంపీపీ) ఎన్నిక ఒప్పందాన్ని ఉల్లంఘించినందునే నేడు ఆమనగల్లు ఎంపీపీ అవిశ్వాసం ఎదుర్కోంటుందని రాంనుంతల ఎంపిటీసీ సరితపంతునాయక్ అన్నారు. మేడిగడ్డ ఎంపిటీసీ అనితవిజయ్, రాంనుంతల ఎంపిటీసీ సరితపంతునాయక్‌ల మధ్య అధ్యక్ష పదవికి తలా రెండున్నర సంవత్సరాలు ఉండాలని ఇరువురుల మధ్య ఒప్పందం ఉందని, కానీ గడువు దాటి ఏడాదిన్నర కావస్తున్నా కూడా చేసుకున్న ఒప్పందానికి తూట్లు పొడిచి మాటతప్పారని ఆమె ఘాటుగా విమర్శించారు. గిరిజన మహిళగా తనకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ఎంపిటీసీల దృష్టికి తీసుకుపోయానని, ప్రస్తుత ఎంపీపీతో వారి ప్రయత్నాలు ఫలించకపోవడంతోనే అవిశ్వాసంతో తనకు న్యాయం చేయాలని గౌరవ సభ్యులు అందుకు చర్యలు తీసుకుంటున్నారని సరితపంతునాయక్ తెలిపారు. సర్పంచ్ సోనశ్రీనునాయక్‌తో కలిసి ఎంపిటీసీ సరితపంతునాయక్ స్థానిక విలేకరుల సమావేశంలో ఆమనగల్లు ఎంపీపీ పదవిపై తీసుకుంటున్న అవిశ్వాసంపై మాట్లాడారు. కొంతమంది గిరిజనులు అవిశ్వాసం ఎదుర్కుంటున్న ఎంపీపీ అనితకు గిరిజన మహిళగా అన్యాయం జరుగుతుందని బాధపడుతున్నారని, అదే గిరిజన సామాజిక వర్గానికి చెందిన మహిళగా తనకూ అన్యాయం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పందం చేసుకున్న పత్రాల ప్రకారం ఇద్దరికీ న్యాయం జరిగేలా గిరిజన సంఘాలు కోరుకోవాలని ఆమె సూచించారు. ఎంపీపీ పదవికి అన్ని విధాల అర్హురాలిగా సరితపంతునాయక్ అభివర్ణించారు. 5 స్థానాలు కల్గిన మండల పరిషత్ పాలకవర్గంలో 4గురు సభ్యులు తమకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని సరితపంతునాయక్ తెలిపారు. రాజ్యాంగబద్దంగానే అవిశ్వాసానికి వెళ్ళామని, ఎవ్వరి ప్రోద్బలంతో చేయటం లేదని, ఇచ్చిన మాట, చేసుకున్న ఒప్పందం ప్రకారమే తనకు న్యాయం చేయాలని కోరుకుంటున్నట్లు సరితపంతునాయక్ తెలిపారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకురాలు కృష్ణవేణి, నిర్మల తదితరులు ఉన్నారు.

## కరెంటు షాక్‌తో మహిళ మృతి

**శంకర్‌పల్లి, జులై 22 ప్రభాతవార్త:** ఈదురు గాలులకు తెగిపడి ఉన్న కరెంటు వైరును చూడకుండా దానిని తొక్కడంతో వివాహిత ఒకరు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని మోకిల గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. ఇందుకు సంబంధించి సిఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోకి ల గ్రామంలోని లేబర్ కాలనీలో మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘట్ జిల్లాకు చెందిన తారా నేవారే (32) తన భర్త ఉమేష్ నేవారేతో కలిసి జీవిస్తోంది. శనివారం ఉదయం 4.40 సమయంలో నీటి సంపులో నీటిని తీసుకుని వస్తుండగా గత నాలుగు రోజుల నుంచి ఈదురు గాలులు, వర్షాలకు కరెంటు వైరు తెగిపడి ఉండగా, అది గమనించని ఆమె దానిపై కాలు వేయడంతో కరెంటు షాక్ తగిలి అక్కడే మృతి చెందింది. ఈ సంఘ టనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

## రోడ్డులపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు

### -జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
అనంతగిరి ఘాట్ రోడ్డులపైన వాహనాలు నిలిపితే కఠినమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు.శనివారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఓ ప్రకటనలో మాట్లాడుతూ.....గత మూడు,నాలుగు రోజుల నుండి వర్షాలు పడుతుండటంతో అనంతగిరి ప్రాంతానికి సందర్శకులు,పర్యాటకులు చాలా మంది రావడం జరుగుతుందని ఇతర ప్రాంతాల నుండి అనంతగిరికి వచ్చి వారు గాని జిల్లాకు సంబంధించిన వారు కాని వాహనాలను అనంతగిరికి వచ్చి పోయే ఘాట్ రోడ్డులపైన పార్కింగ్ చేస్తున్నారని హరిత రిసార్ట్ ముందు నుండి క్రిందకు వెళ్లే ఘాట్ వన్ వేలో కొందరు కావాలని వాహనాలను ఎదురుగా పైకి వస్తున్నారని దృష్టికి రావడం జరిగిందన్నారు.అనంగిరికి ఘాట్ రోడ్డులలో భారీ వాహనాలు,ఇతర వాహనాలు నిరంతరం ప్రయాణిస్తూ ఉంటాయని కావున పర్యాటకులు,సందర్శకులు ఎట్టి పరిస్థితులలో తమ వాహనాలను ఘాట్ రోడ్డులపైన ఉంచవద్దని మరియు వన్ వే ఘాట్‌లో క్రిందకు దిగే వాహనాలకు ఎదురుగా రావద్దు అని వాహనాలకు కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలలో గాని ఇతర వాహనాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.ఘాట్ రోడ్డులలో వాహనాలు నిలిపితే మరియు వన్ వే ఘాట్ రోడ్డులపైన వాహనాలు నిలిపితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఘాట్ రోడ్డుల పైన వాహనాలు నిలిపితే వర్షాలకు ముందు వాహనాలు కనబడక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి కావున ప్రయాణికులు ,పర్యటకులు ,సందర్శకులు ఎవ్వరు కూడా ఘాట్ రోడ్డులలో వాహనాలు నిలపవద్దని జిల్లాలో కూడా ప్రయాణికులు తమ వాహనాలను ఎక్కడి పడితే అక్కడ రోడ్డుల మీద నిలపవద్దని ఏమైనా అత్యవసరం ఉన్నచో డైల్ 100కి కాల్ చేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

## నేడు ఘట్‌కేసర్‌లో బోనాలు..ఏర్పాట్లు పూర్తి

**ఘట్‌కేసర్, జులై 22, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ పట్టణంలో ఆదివారం బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. బోనాల పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో ఉన్న గ్రామదేవతల ఆలయాలకు రంగులు, వేపకొమ్మలు, మామిడి తోరణాలు వేసి విద్యుత్ లైట్లతో అలంకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆయా వార్డుల్లోని ఆలయాల వద్ద పారిశుద్య పనులు చేయించి తగిన ఏర్పాట్లు చేశారు. పట్టణంలో మున్సిపల్ కార్మికుల చేత రోడ్లు శుభ్రం చేయించి, వీధిదీపాలు వేయించారు. అంబేద్కర్‌నగర్, బాలాజీనగర్, గాంధీనగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, శివారెడ్డిగూడ, మేడపాటినగర్ తదితర చోట్ల ఉన్న పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, చిత్తారమ్మ, మహంకాళీ, పెద్దమ్మ అమ్మవార్ల ఆలయాలను సిద్దం చేసి బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నైవేద్యం సమర్పి ంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో అమ్మవార్లకు తొట్టెల, ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించేందుకు సిద్దమవుతున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు బోనాల సందర్భంగా పలు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బోనాల సందర్భంగా ఘట్‌కేసర్‌లో మాంసం, చికెన్, మద్యం దుకాణాలు కొనుగోలు దారులతో రద్దీగా మారనున్నాయి. మట్టికుండలు, దీపంతలు, పూలు, పూజా సామాగ్రి విక్రయాలు జరుగుతున్నాయి. మరోవైపు బోనాలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.


ఘట్‌కేసర్ అంబేద్కర్ నగర్‌లో దేవాలయ ఆవరణలో పనులు చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, కౌన్సిలర్ పద్మారావు

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మహిళల ధర్నా


పర్వతాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

**బోడుప్పల్, జులై 22 (ప్రభాతవార్త) :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని పర్వతపూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను గుట్టుగా పంపిణీ చేశారని ఆరోపిస్తూ పలువురు మహిళలు శనివారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఈ స్థలంలో గతంలో బేస్‌మెంట్లు నిర్మించుకున్నామని తెలిపారు. అప్పటి ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్‌రెడ్డి, సర్పంచ్ బొడిగె రాందాస్‌గౌడ్‌లు ఇక్కడ నిర్మించే డబుల్ బెడ్‌రూం ఇళ్లలో బేస్‌మెంట్లు కట్టిన స్థలాలను కోల్పోయిన వారి డబుల్ బెడ్‌రూంలు కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు గుట్టుగా ఎందుకు పంపిణీ చేశారని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌ని నాగారం మున్సిపల్ కమీషనర్ రాజేంద్రకుమార్‌ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసిన దృశ్యం

# శారీరక రుగ్మతలకు చక్కటి పరిష్కారం యోగా

- -ఆసక్తిచూపుతున్న జిల్లా వాసులు
- -తాండూరులో మూడవ శిక్షణ శిబిరం
- -జిల్లాలో 4 వేల మందికి శిక్షణ పూర్తి

: ఆచార్య శివానంద





**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఆస్తులు, అంతస్తులు ఎన్ని ఉన్నా ఆరోగ్యం సహకరించకుంటే ఫలితం లేదని అంటున్నారు. ప్రస్తుత బిజీ లైఫ్‌లో మనం తీసుకునే ఆహారం, తాగే నీటి వల్ల శారీరక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇటీవల ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్, చాట్ వైపు పరుగులు పెడుతున్నారు. ఫలితంగా అనేక మంది రోగాలబారిన పడుతున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా కొంతమంది వైద్యులు టెస్ట్‌లు లేనిదే చికిత్సలు నిర్వహించలేని పరిస్థితి. ఇది మధ్య, పేద తరగతి ప్రజలకు ఎంతో భారం. ఇలాంటి క్రమంలో మన ఆరోగ్యాన్ని మన చేతుల్లో ఉంచుకోవాలంటే పూర్వీకుల ద్వారా వచ్చిన యోగా సాధన చక్కటి పరిష్కారంగా కనిపిస్తోంది. పైసా ఖర్చు లేకుండా యోగా ప్రాక్టీసు చేయడమే కాకుండా ఆహారపు అలవాట్లను మార్చుకుంటే మన ఆరోగ్యం మన చేతుల్లోకి వస్తుందని శిక్షకులు చెబుతున్నారు. చాలామంది యోగా సాధన చేసి వివిధ రుగ్మతల నుంచి బయటపడిన వాళ్లు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలిక రోగాల బారిన పడి నిత్యం టాబ్లెట్లు వాడేవారు శిక్షణ పట్ల ఆసక్తి చూపెడుతున్నారు. టాబ్లెట్ల ద్వారా కంట్రోల్ చేసుకునే బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి రుగ్మతల నుంచి యోగా ద్వారా బయటపడుతున్నామని చెబుతున్నారు. కొంత మంది టాబ్లెట్లను కూడా మానేసి యోగా సాధన చేయడం గమనార్హం.

### జిల్లాలో ధ్యానాసన యోగా

ధ్యానాసన యోగా శిబిరం ద్వారా వేల సంఖ్యలో శిక్షణ పొందారు. జిల్లాలోనఇ వికారాబాద్, తాండూరు, కులకచర్ల, పరిగి, నంచర్ల ప్రాంతాలలో సుమారు 4 వేల పైచిలుకు మంది శిక్షణ పొందడం గమనార్హం. హుజురాబాద్‌కు చెందిన ఆచార్య శివానంద నేతృత్వంలో శిబిరాలు కొనసాగుతున్నాయి. ఒక్కో శిబిరాన్ని 10 రోజుల పాటు నిర్వహిస్తారు. ప్రస్తుతం తాండూరులో మూడవ విడత శిబిరం కొనసాగుతోంది. జూన్ 21 నుంచి ఇప్పటి వరకు 2 విడతలు పూర్తి చేశారు. మూడు రోజుల క్రితం మూడవ విడత ప్రారంభించారు. ప్రతి శిబిరంలో 200 మంది శిక్షణ పొందారు. ఈసారి మూడవ శిబిరంలో 240 మంది మహిళలు, పురుషులు శిక్షణ పొందుతున్నారు. తాండూరులో పెద్ద సంఖ్యలో మహిళలు ఆసక్తి చూపెడుతున్నారు. పలువురు వైద్యులు కూడా యోగా సాధన చేస్తున్నారు. శివానంద ఆచార్య ఐదేళ్ల పాటు శిక్షణ పొందిన తర్వాత గత 10 ఏండ్లుగా శిబిరాలను నిర్వహిస్తున్నారు. కరీంనగర్, జగిత్యాల, హుజురాబాద్, గోదావరిఖని, మంచిర్యాల, వేములవాడ, మహబూబాబాద్ ప్రాంతాలలో 250 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. శంకర్‌పల్లి, పరిగి, తర్వాత తాండూరులో శిబిరాలు చేపట్టారు. ప్రజలు ఆసక్తి చూపుతున్నందున 4వ విడత శిబిరాన్ని తాండూరులోని తులసీగార్డెన్‌లో ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు.

### వివిధ విభాగాలపై శిక్షణ

సంపూర్ణ ఆరోగ్య సాధన కోసం యోగాలోని పలు అంశాలపై దృష్టి సారించారు. రోగాలు రాకుండా, వచ్చిన రోగాలను ఎలా దూరం చేయాలనే అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. ముందగా ఆసనాలు, ప్రాణాయామం, వాటర్ థెరపీ, అమృత ఆహారం ద్వారా చక్కటి పరిష్కారం లభిస్తోంది. అతి బరువు, మానసిక ప్రశాంతత, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తున్నాయి. వ్యాయామాలు,ఆసనాలు, సూర్య నమస్కారాలు, దీర్ఘ శ్వాస, రాజయోగ ప్రాణాయామాలు,ఆక్యుప్రెజర్,వేడిని తగ్గించే శ్వాస ప్రక్రియకు శిక్షణ ఇస్తున్నారు. గుండె, లివర్, కిడ్నీ సమస్యలతో పాటు అజీర్తి, సైనస్, తలనొప్పి, మైగ్రేన్, కంటి,చెవి,ఆస్తమా వంటి రుగ్మతలకుచక్కటి పరిష్కారాలు చూపెడుతున్నారు.

### ఆర్యవైశ్య సంఘం సంపూర్ణ సహకారం

ప్రజల ఆరోగ్యం కోసం తాండూరు ఆర్యవైశ్య సంఘం వారు యోగా తరగతులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియాన్ని నెల రోజుల పాటు ఉచితంగా అందజేశారు. ఈ ఫంక్షన్ హాలు రోజు అద్దె రూ.50 వేల వరకు ఉంటుంది. ప్రజల ఆరోగ్యం కోసం తాము ఎల్లవేళలా సంపూర్ణ సహకారం అందజేస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కట్కం వీరేందర్, కోట మురళీకృష్ణ, ప్రతినిధి దాదాపురం రవీందర్ తెలిపారు. వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలతో పాటు విద్యార్థులు కూడా యోగా వైపు ఆసక్తి చూపడం అభినందనీయమని కొనియాడారు. ఇలా ఉండగా పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్, చెంగోల్ విష్ణు, పద్మనాభరావు, మైదాన్ గ్రూప్ సభ్యులు రాజుగౌడ్, సాయిరెడ్డి, సురేందర్‌రెడ్డి, బాలాజీ వెంకట్, బంట్వారం విజయ్, సతీష్, మధు, మనోహర్, వెంకట్‌కృష్ణ గౌడ్ తదితరులు కూడా వలంటీర్లుగా ఉంటూ శిబిరానికి సంపూర్ణ సహకారం అందజేస్తామని తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన ముస్లిం మైనార్టీలు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



పార్టీలో చేరుతున్న మహిళలతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్.

**షాద్‌నగర్, జూలై 22, (ప్రభాతవార్త) :**
కేశంపేట మండలం బైర్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన సుమారు 50మంది ముస్లీం మైనార్టీ మహిళలు, కాంగ్రెపార్టీ నాయకులు, గ్రామస్థులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే స్వగ్రామమైన ఎక్లాస్ ఖాన్‌పేట గ్రామంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమాక్షంలో వారంత పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకార్షితులవుతున్న నాయకులు, ప్రజలు పార్టీలో చేరుతున్నారని ఆయన అన్నారు. పార్టీలో కష్టపడ్డా ప్రతిఒక్కరికి సరియైన గుర్తింపు ఉంటుందని, పార్టీ అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. పాత కొత్త అనే తేడా లేకుండా అందరు కలిసిమెలిసి పార్టీ కోసం పని చేయాలని, పార్టీ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో జులేఖ, ఇస్మాయిల్, చోటీ, సాబేరబేగం, రేష్మ, షరీఫా, షబానా, రిజ్వాన, షాజహాన్, షబానా, షహనాస్, నూరాబి, వహిదా, ఆమీన, తబుస్సుమ్, అంజు, జహీదా, షహన్య, నూర్జాహాన్, ఖతీజ, నజీర్, జహంగీర్, సాధిక్, వహిదా, పాషా, జహీద్, తోఫిక్, తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రథయాత్రను దిగ్విజయం చేద్దాం



**తాండూరు టౌన్ జూలై22,ప్రభాతవార్త :**
పాత పింఛన్ ధ్యేయంగా కొనసాగుతున్న పాత పెన్షన్ సాధనా సంకల్ప యాత్ర వికారాబాద్ జిల్లాలోకి 29వ తేదిన ప్రవేశించి మధ్యాహ్నం 1 నుండి 2 వరకు వికారాబాద్‌లో మరియు 3 నుండి 4 వరకు తాండూరులో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల అనిల్ తెలిపారు.దీనికై జిల్లా ఆసుపత్రి తాండూరులో నర్సింగ్ స్టాఫ్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు.అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల సమిష్టి డిమాండ్ అయిన పాత పెన్షనును ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిందిగా ఉద్యోగులు కోరుతున్నారు.దానికి జరుగుతున్న ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ స్టాఫ్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

-నాలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి: ఎంపిపి



చౌదరిగూడ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీనివాసరావు

**ఘట్‌కేసర్, జూలై 22, ప్రభాతవార్త:**
రోడ్డు నిర్మాణ పనులు సక్రమంగా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. నారపల్లి నుంచి ఎదులాబాద్ వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఎంపిపి ఆర్అండ్‌బి చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన స్పందించి అధికారులను పంపించారు. ఈమేరకు ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీనివాస్‌రావుతో పాటు ఎంపిపి సుదర్శన్‌రెడ్డిలు చౌదరిగూడలో రోడ్డు గుంతల పడిన స్థలాలను పరిశీలించారు. ఈరోడ్డు పక్కన ఉన్న కల్వర్టులు మూసి వేయడంతో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాలాల నుంచి వరద నీరు సరిగా వెళ్లక రోడ్డుపై నిలిచిపోతుందని ఎంపిపి తెలిపారు. స్థానికంగా 40 నుంచి 50 వేల మంది జనాభా నివాసం ఉంటున్నారని రోడ్డు సరిగా లేక నాలాల ధ్వంసంతో కాలనీలోకి వరద నీరు వచ్చే ఆస్కారముందన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లాది రుపాయల వ్యయంతో నారపల్లి-ఎదులాబాద్‌రోడ్డు విస్తరణ పనులు చేపట్టగా పలు చోట్ల కల్వర్టుల నిర్మాణంలో జాప్యం జరుగుంతని, రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేయకపోవడంతో గుంతలు పడి ప్రమాదకరంగా మారిందన్నారు. అధికారులు త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు. ఎంపిటిసి సభ్యులు నిరుడి రామారావు,ఆర్అండ్‌బి ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇళ్లు కూలిన బాధితురాలికి ఆర్థిక సాయం

**ఘట్‌కేసర్, జూలై 22, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలో వర్షానికి ఇళ్లు కూలిపోగా తృటిలో ప్రాణాపాయం తప్పింది. 4 రోజులుగా కురుస్తున్న వర్షంతో నడిమింటి అంజయ్య-నాగమణి తడిసి పాత ఇళ్లు శుక్రవారం రాత్రి పాక్షికంగా కూలీపోయింది. దీంతో వారు భయపడి బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైఎస్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో కూలిన ఇంటికి రేకులు వేయిస్తామని ఆయన బాధితులకు హమీ ఇచ్చారు. ఘట్‌కేసర్ మండలంలో నిర్మించిన 4,700 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంపిటిసి గట్టగళ్ల రవి చేరుకొని బాధితులకు తక్షణంగా ఆర్థిక సాయం అందజేశారు. బిజెపి గ్రామ అధ్యక్షులు కుమారస్వామి, వార్డుసభ్యులు బేల ఎసురేశ్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సాయి తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ పేదలకు ఆరోగ్య ప్రదాయిని

### రూ.3లక్షల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే

**పాపన్నపేట, జూలై 22, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురైన నిరుపేదలు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందుకునేందుకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాంధారిపల్లి గ్రామానికి చెందిన యం శ్రీనివాస్ ఇటీవల ఆనారోగ్యానికి గురై చికిత్స అందుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శ్రీనివాస్ మెరుగైన చికిత్స అందుకునేందుకు సిఎంఆర్ఎఫ్‌లో 3 లక్షల రూపాయలను మంజూరు చేయించి శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు ఎల్ఓసిని అందచేశారు. ఎల్ఓసిని అందచేసిన ఎమ్మెల్యేను, అందుకు సహకరించిన నాయకులకు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**ఆగస్టు 2న వినియోగదారుల ముందుకు రానుంది**

శామీర్ పేట జూలై22,ప్రభాతవార్త : మార్వెల్ స్టూడియస్ గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వాల్యూం 3 డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఆగస్టు 2న ప్రసారం ప్రారంభవుతుందని డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ప్రకటించింది.తెలుగుతో పాటు పలు భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.జేమ్స్ గన్ దర్శకత్వం వహించిన గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వాల్యూమ్ 3 చిత్రంలో పలువురు నటీనటులు అద్భుతంగా నటించారు.కెవిన్ ఫీజ్ లూయిస్ డి ఎస్పోసిటో ,విక్టోరియా అలోన్సో నికోలస్ కోర్డా,సారా స్మిత్,సైమన్ హాటల్‌తో కలిసి నిర్మాతలుగా వ్యవహరించారు.

## మణిపూర్‌లో మహిళల పట్ల హత్యలు,దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** మణిపూర్‌లో మహిళల పట్ల హత్యలు, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సమావేశం శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. గత కొన్ని రోజులుగా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయని అ రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యాఖ్యాలు చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని అలాంటి అసమర్థ సిఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మైతి,కుకి తెగల మధ్య చాలా కాలం నుంచి ఘర్షణలు జరుగుతున్నాయని వాటిని చర్చల ద్వారా పరిష్కరించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గత 40 రోజులుగా మణిపూర్‌లో ఇంటర్‌నెట్ సౌకర్యం కట్ చేసి అక్కడి సమాచారం బయట ప్రపంచానికి తెలియకుండా చేయడం అ రాష్ట్రంలో ప్రజల పట్ల జరుగుతున్న దాడులు, అరాచకాలకు నిదర్శమన్నారు. బెటి బచావో, భేటీ పడావో అనే నినాదం ఇచ్చే బిజెపి పాలిత రాష్ట్రాలలో మహిళలకు, దళిత, గిరిజనులకు, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాజ్యాగంలో ఉన్న చట్టాలను అమలు చేయకుండా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసి బిజెపి, అర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తూ వారి మతోన్మాద ఎజెండాను అమలు చేస్తుందన్నారు. దేశంలో మత సామరస్యాన్ని కాపాడేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్,దాసరి కళావతి, సందబోయిన ఎల్లయ్య, గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్, అలేటీ యాదగిరి,అమ్ముల బాలనర్సయ్య, బద్దిపడగా కృష్ణారెడ్డి, చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి నవీన, అత్తిని శారద, బండకింది అరుణ్‌కుమార్, సనాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

## నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలి

-మున్సిపల్ చైర్‌పసర్సన్ ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్,జూలై22,ప్రభాతవార్త :** మొక్కలు నాటడంతో పాటు ఆటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. శనివారం రోజున పట్టణంలోని రెండవ వార్డు శాంతినగర్‌లో కౌన్సిలర్ బోజు రమాదేవిరవిందర్ ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరై మొక్కలు నాటారు.అనంతరం వార్డులోని ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు తీసుకున్న ప్రతీ మొక్కను నాటడంతో పాటు వాటి రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనిత్రశ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జ శానిటరీ ఇన్స్పెక్టర్ జాలిగం శంకర్,ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## దుండగులను నిరినంగా శిక్షించాలి

-ఏఐఎఫ్‌బి నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్

**హుస్నాబాద్‌రూరల్,జూలై22,ప్రభాతవార్త :** మణిపూర్‌లో ఇద్దరు కుకీ జాతి స్త్రీలను నగ్నంగా ఊరేగించి మానభంగం చేసి హత్య చేసి తగులబెట్టిన దుండగులను మోడీ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ డిమాండ్ చేశారు.శనివారం రోజున ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై ప్రధాని మోడీ ఆ ప్రాంత సమస్యలపై సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆ రాష్ట్రంలో జరుగుతున్న రెండు వర్గాల ప్రజల అల్లర్ల ప్రజల్లో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.స్త్రీలను నగ్నంగా ఊరెగించి,మనబంగం చేసి హత్య చేసిన దుండగులను గుర్తించి వారిని బహిరంగంగా ఉరి తీసి భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా చూసుకోవాలన్నారు.

**అరాచకానికి కేంద్రం బాధ్యత వహించాలి**

మణిపూర్‌లో ఇద్దరు కుకీ జాతి స్త్రీలపై జరిగిన అరాచకానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఏఐఎస్‌బి జిల్లా నాయకులు గడిపె సుజిత్ డిమాండ్ చేశారు. శనివారం రోజున మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి గిరిజన,బలహీన వార్గల మహిళలపై దాడులు ఎక్కువ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా కేంద్రం తీరు మార్చుకుని నిందితులను బహీరంగంగా ఉరి తీసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు శివకుమార్, అంజి,రామ్‌చరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాయరావు చెరువు అలుగు వద్ద కట్టపై బారికెడ్లను ఏర్పాటు చేయాలి

**నర్సాపూర్, జూలై 22.ప్రభాతవార్త:** నర్సాపూర్ లోని రాయరావు చెరవు వద్ద ప్రమాదాలు జరుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని నర్సాపూర్ మున్సిఫల్ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ అన్నారు.ఈ సందర్భంగా బుచ్చేష్‌యాదవ్ మాట్లాడుతూ రాయరావు చెరువు అలుగు పారె ప్రాంతంలో బారి కేడ్లు లేక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున బారి కేడ్లను తప్పక ఏర్పాటు చేయాలన్నారు.గత మూడు నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్నవర్షాలకు రాయరావు చెరువు నిండి జలకల సంతరించుకుందన్నారు. ఈ అలుగు పారడాన్ని తిలకించడానికి పట్టణ ప్రజలు వస్తుంటారన్నారు. ఇందుకోసం చెరువు అలుగు పారె కట్టపై బారి కేడ్లను ఏర్పాటు చేయవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా మున్సిఫల్ అధికారులు స్పం దించి వెంటనే రాయరావుచెరువు కట్టపై బారికేడ్లను ఏర్పాటు చేసి ప్రమాదాల బారి నుండి ప్రజలను కాపాడాలని కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ కోరారు.

## 6న హాఫ్ మారథాన్ రన్ : ఏసిపి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ సురేందర్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్(చిన్నకోడూరు), జూలై 22, ప్రభాతవార్త :**
ఆరోగ్య, స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా మంత్రి తన్నీరు హరీష్‌రావు చొరవతో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్, పోలీసుశాఖ సమన్వయంతో అగస్టు 6న రంగనాయక సాగర్ ప్రాజెక్టుపై హాఫ్ మారథాన్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట ఏసీపీ కేతినేని సురేందర్‌రెడ్డి తెలిపారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు హాఫ్ మారథాన్‌పై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో అయన పాల్గొని మాట్లాడారు. హాఫ్ మారథాన్ పోటీలలో భాగంగా 5కె, 10కె, 21కె రన్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హాఫ్ మారథాన్ పోటీలలో పాల్గొనడానికి ఇప్పటికే సిద్దిపేట, వివిధ జిల్లాల యువతి, యువకులు, ఉద్యోగ ఉపాధ్యాయులు, మహిళలు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాలలో అసక్తి గల యువతీ, యువకులు, ఉత్సాహవంతులు హాఫ్ మారథాన్ రన్ పోటీలలో పాల్గొనే వారు హెచ్‌టిటిపిఎస్:// ఎస్‌హెచ్ ఎం23.ఐక్యూ301.సిటిఎంలో రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొనాలన్నారు. 5కె రన్‌లో పాల్గొనే వారు రూ.200,10కె రన్‌లో రూ.300,21 రన్‌లో రూ.500 గూగుల్ పే, ఫోన్ పే, యూపీఐకోడ్ ద్వారా చెల్లించి పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అగస్టు 6న ఉదయం 5.30కి 21కె రన్ సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి రంగనాయకసాగర్ ప్రాజెక్టు వరకు రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. 5కె, 10కె రన్ రంగనాయకసాగర్ ప్రాజెక్టుపై నిర్వహిస్తారని తెలిపారు. హాఫ్ మారథాన్ రన్ అహ్లాదకరమైన అత్యంత అద్భుతంగా పండుగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. యువతి, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు పురస్కారం అందజేయడం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే వారికి టీ షర్ట్స్, మెడల్స్ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, రూరల్ సీఐ చేరాలు, నారాయణరావుపేట ఎంపిపి బాలకృష్ణ యాదవ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కాముని ఉమేష్‌చంద్ర, సర్పంచ్ గాజుల బాబు, గంగాపూర్ సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, ఎస్ఐ శివానందం, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

## మణిపూర్ సంఘటనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదు

టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం

**సిద్దిపేట రూరల్, జూలై 22, ప్రభాతవార్త :**
కేంద్రంలో ప్రభుత్వ పాలన ఉందా లేదా అర్థం కావడం లేదని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం అన్నారు. సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి. ఇమామ్(అత్తు) అధ్వర్యంలో పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో శనివారం ప్రధాన మంత్రి మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం మాట్లాడుతూ మణిపూర్‌లో గత కొన్ని రోజులుగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఘటనలు పాల్పడుతున్న వారిని పట్టించుకునే నాథుడే లేదని అవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో వ్యక్తిగత దాడులు, హత్యలు చేసుకోవడం, మహిళలను రేప్ చేసి చంపేస్తున్నారని వాపోయారు. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేట న్నారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైం దన్నారు. మోడీ హయాంలో అయా రాష్ట్రాలలో అల్లర్లు జరిగాయే తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ఎలాంటి అల్లర్లకు, హింసాత్మక ఘటనలకు తావు ఇవ్వలే దన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండా లన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీ, పార్టీ నాయకులు మజర్ మాలిక్, గాయా సుద్దీన్,మధు, బిక్షపతి, బింగి యాదగిరి, చింతల లక్ష్మీ, నర్సవ్వ, రజిని, శ్యామల, రాశి, రాకేష్, నవాజ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన విశ్వబ్రాహ్మణులు



ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన నర్సాపూర్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

**నర్సాపూర్, జులై 22.ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని హైద్రాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో కలిసి శాలువాతో సన్మానించారు.మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞశాల పెద్దు నిర్మాణానికి గత నెల 6 లక్షల రూపాయిల నిధులు మంజూరు చేయించారు. ఇందుకుగాను విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులుఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.అంతేగాక ఈ ఆలయం వద్ద సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. అదేవిదంగా వారం పది రోజుల్లో విశ్వబ్రాహ్మణ కుల సంఘం భవనానికి స్థలం ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మబణ సంఘం సభ్యులు కమ్మరి కృపాచారి, అంజయ్యాచారి,సదానందచారి, సతీష్‌చారి, మహేశ్‌చారి, శంకరయ్యాచారి, రమేశ్‌చారి, శ్యామ్‌సందర్‌చారి వెంకటేశ్‌చారి, నరెందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## జల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

**నర్సాపూర్,నర్సాపూర్ రూరల్, జులై 22.ప్రభాతవార్త:.**
నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలోశనివారం పురస్కరించుకొనిశ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు భక్తులు భక్తి శ్రద్దలతో నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనేయస్వామికి జలాబిషేకం,పంచామృతాబిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం దాతలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలోఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళు, ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాసుల కై ఆహ్వానం

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. దామోదర్

**నర్సాపూర్, జులై 22.ప్రభాతవార్త:** నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల కై ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. దామోదర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడిగ్రీ కళాశాలలో కామర్స్ 2 పోస్టులు తెలుగు ,ఇంగ్లీష్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్,ఎకానామిక్స్. జువాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి గాను ఆయా సబ్జెక్ట్ లలో పిజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు, ఇతరులకు 55 శాతం మార్కులు కలిగి ఉండి పిహెచ్‌డి నెట్..సెట్ అర్హత కల్గిన వారికి ప్రాదాన్యాత ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ అర్హత కలిగిన వారు అర్హత పత్రాల జిరాక్స్ కాపిలతో జత చేసి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24 తేదీలోగా అందజేయాలని ఆయన తెలిపారు.దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజనల్, జిరాక్స్ పత్రాలతో మంగళవారం 25 వ తేదీనా ఉదయం 11 గంటలకు నర్సాపూర్ డిగ్రీ కళాశాల పెద్దచింతకుంటలో డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.దామోదర్ తెలిపారు.

## కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటా

బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి

**మిరుదొడ్డి, జూలై 22, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అపదొచ్చిన ఎల్లప్పుడు అండగా ఉంటానని దుబ్బాక నియోజకవర్గ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు ఎర్రల శ్రీనివాస్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆర్థిక సహాయం అందించారు. అలాగే బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూచిగారి భూమరాజయ్య, మొగుళ్ల ఐలయ్యలు బైక్‌పై ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా వారిని స్వగృహంలో పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పునాది వారికి అండగా ఉంటానని తెలిపారు. అయన వెంట పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి, మండల యూత్ అధ్యక్షులు ధర్మారం కుమార్, నాయకులు దార మల్లయ్య, ధర్మారం మల్లయ్య, కమ్మరి శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.



కుంటను తలపిస్తున్న ప్రభుత్వ కళాశాల రోడ్డు

## భవనం నిర్మించారు.. రోడ్డు వేయడం మరిచారు

**కంగ్టి, జులై 22, ప్రభాతవార్త:** బంగారు తెలంగాణగా మార్చామని చెబుకుంటున్న ప్రభుత్వ పాలకులకు మండల కేంద్రమైన కంగ్టిలోని టిటిడబ్లుయుఆర్ జూనియర్ కళాశాల వసతి గృహం దుస్థితి కానరావడం లేదా అని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండల కేంద్రమైన కంగ్టిలో ఇటీవల టిటిడబ్లుయుఆర్ జూనియర్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. వసతి గృహాన్ని అయితే అందంగా నిర్మించారు కాని వసతి గృహం పరిరాల్లో, బయటకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో పరిసరాలు చిన్న పాటి వర్షానికి బురదమయం అవుతుండటంతో విద్యార్థులు వసతి గృహం నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షం కురిసిన సమయాల్లో విద్యార్థులు ఆరు బయటకు పోయే పరిస్థితి లేకుండా పోవడంతో విద్యార్థులు వసతి గృహంలోనే బంధీఖానాలుగా ఉండిపోవాల్సిన దుస్థితి దాపురించింది. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

## 17వ రోజుకు చేరిన పంచాయతీ కార్మికుల సమ్మె

**ఝరాసంగం, జులై 22, ప్రభాతవార్త:** న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పంచాయితీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారంతో 17వ రోజుకు చేరుకుంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్మికులు డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీలు రాకపోవడం పట్ల కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల కార్మిక సంఘం అధ్యక్షులు సంగన్న, నాయకులు, కార్మికులు దిగంబర్, రాజారత్నం, అశోక్, రాందాస్, విజయ్, బాలరాజ్, లక్ష్మి, భూమమ్మ పాల్గొన్నారు.

## కల్వర్టులను పరిశీలించిన అధికారులు

-ప్రజలకు జాగ్రత్తలు చెప్పిన డిఎల్‌పిఓ, ఎంపిడిఓ



మామిడ్గి వాగుపై కల్వర్టును పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ, ఎంపిడిఓలు

**న్యాల్‌కల్, జులై 22, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో గత మూడు నాలుగు రోజులుగా మేఘాలకు చిల్లులు పడ్డాయన్నట్లుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని గ్రామాలు తడసి ముద్దయినాయి. గ్రామాల్లో భారీగా వర్షాలు పడుతుండటంలో గ్రామాల శివారులోని వాగులు, వంకలు పరెగుత్తుతున్నాయి. మండలంలోని రేజింతల్, మామిడ్గి, గంగ్వార్ తదితర గ్రామాల్లోని కల్వర్టులను పంచాయితీ రాజ్ అధికారులు పరిశీలించారు. రేజింతల్ గ్రామ శివారులోని రేజింతల్ నుంచి ఎల్గోయి వైపు వెళ్లే రోడ్డులో గల వంతెనపై భారీగా నీరు ప్రవహించిన తరుణంలో గతేడాది ఓ వ్యక్తి సైకిల్ మోటారుతో వాగులో పడి కొట్టుకుపోయి మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఈ సారి కూడా వాగుపై నీరు ప్రవహిస్తుండటంతో డిఎల్‌పిఓ రాఘవరావు, ఎంపిడిఓ వెంకట్‌రెడ్డిలు పంచాయితీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి పరిశీలించి ప్రజలకు పలు జాగ్రత్తలు సూచించారు. పొంగుతున్న వాగులు, వంకల వైపు ప్రజలు వెళ్లకుండా ఉండాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మామిడ్గిల ప్లాంటేషన్ పనులను పరిశీలించి బంగారు చెరువును పర్యవేక్షించారు.

## ఎస్ఐని సన్మానించిన బిజెపి నాయకులు

**న్యాల్‌కల్, జులై 22, ప్రభాతవార్త:** హద్నూర్ పోలీసు ఠాణాకు ఎస్ఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన పి రామ నాయుడును శనివారం మండల భారతీయ జనతా పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. పటాన్‌చెరు నుంచి హద్నూర్‌కు బదిలీపై వచ్చిన రామనాయుడును బిజెపి మండల అధ్యక్షులు ఏక్‌నాథ్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో నాయకులు మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభు చారి, గోపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింలు, ఓనం రెడ్డి తదితరులు ఠాణాకు చేరుకుని ఎస్ఐని సన్మానించి శాంతి భద్రతలకు తమ వంతు సహకరిస్తామని ఎస్ఐకి నాయకులు హామి చేశారు. ఇదిలా ఉండగా బిఆర్ఎస్ మండల యువ నాయకులు మొహమ్మద్ ఆసిఫ్, షేఖ్ మజీద్‌లు మర్యాద పూర్వకంగా ఎస్‌ని కలిసి శాలువాతో సన్మానించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సదాశివపేట, జులై 22, ప్రభాతవార్త:** ఈ నెల 23వ తారీఖున పట్టణంలోని 2వ ఫీడర్‌పై చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ పట్టణ ఏఈ తెలిపారు. పట్టణంలోని ఫయాజ్ నగర్, గుజరాతన వెంచర్, వికారాబాద్ రోడ్డు, రహమత్ నగర్ కాశెట్టి వెంచర్, సంగం వెంచర్, గొల్ల కేరి, గంజి వెనుకాల వైపు, హరిజనవాడ, గాంధీ చౌక్, పాతకేరి, ఎడ్ల బజార్, తిలక్ రోడ్డు, శాస్త్రి రోడ్డు, లోపలి కోట, మండల పరిషత్ కార్యాలయం, మహమ్మదీయ నగర్, దుర్గమ్మ ఆలయం ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్న సమయంలో ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఏఈ వినతి చేశారు.

## ఈవిఎం మిషన్‌లో ఓటు వేసే విధానపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

**హుస్నాబాద్,జులై22,ప్రభాతవార్త:** హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్న పేట మండలంలోని గౌరవెల్లి,గుడాటిపల్లి,తెనుగుపల్లి గ్రామాలలోని 47,48, 49,50 పోలింగ్ కేంద్రాలతో పాటు నూతనంగా నిర్వాసితులు నిర్మించుకున్న కాలనీలో ప్రజలకు శనివారం రోజున హుస్నాబాద్ గిరిదావర్ సుహాని ఆధ్వర్యంలో ఈవిఎం మిషన్ల పని తీరుతో పాటు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరక హుస్నాబాద్ ఆర్డీవో సూచనలతో వచ్చే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే తీరును వారికి అర్థమయ్యేలా వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కరీం తదితరులు పాల్గొన్నారు.

**సరికొత్త ఆవిష్కరణను తీసుకురావడమే లక్ష్యం**

మైగ్లామ్ ద్వారా ఆవిష్కరిస్తున్న మనీష్ మల్హోత్రా సరికొత్త మిని లిప్‌స్టిక్ సెట్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది.మేకప్ ఇష్టపడే ప్రతి ఒక్కరి దగ్గర తప్పనిసరిగా ఉండాల్సిన వస్తువు ఇది.గ్లామర్ క్షణాలకు ఇది చక్కగా సరిపోతుంది.ఈ మిని లిప్‌స్టిక్ సెట్స్ ద్వారా అధరాల అందాన్ని స్టైల్‌గా ఆవిష్కరింకోవచ్చుని గుడ్ గ్లామ్ గ్రూప్,గుడ్ గ్లామ్ బ్రాండ్స్ సీఈఓ సుఖ్లీన్ అనేజా తెలిపారు.

# రోగాలు వచ్చేకాలం...జర భద్రం

-ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్లీన్ అండ్ గ్రీన్



నందిగామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిచ్చిమొక్కలను తొలిగిస్తూ శుభ్రం చేస్తున్నా నాయకుల దృశ్యం

**నందిగామ జూలై22,ప్రభాతవార్త :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారమున్నందున ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాలను,ప్రభుత్వ,ప్రైవేట్ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం నందిగామ మండల కేంద్రంలోని ప్రాథమి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ,ఆసుపత్రి ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను ,చెత్త,చెదారాన్ని గ్రామ పంచాయితీ పారిశుధ్య సిబ్బంది,ఆరోగ్య సిబ్బంది చేత తొలగించి శుభ్రం చేయించారు.కలర,మలేరియా,డెంగ్యూ,డయోరియా వంటి వ్యాదుల భారిన పడకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్ వేజర్ అమృత,మాజీ ఉప సర్పంచ్ చంచోటి కృష్ణ,ఎఎన్ఎం స్వరూప,బిఆర్ఎస్ నాయకులు శివ్వగల్ల రమేష్,ఆసుపత్రి వైద్యసిబ్బంది,పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే వారికి బంగారు భవిష్యత్

-మాజీ మంత్రిని కలిసిన బిఆర్ఎస్ సీనియర్ నేత



మాజీ మంత్రి ఆవాంఛ లక్ష్మారెడ్డిని కలిసి పూలబోకే అందజేస్తున్న చెన్నయ్య

**నందిగామ జూలై22,ప్రభాతవార్త :** పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని,ఉద్యమనేత షాద్‌నగర్ అభివృద్ధిని కాంక్షించే అజయ్య యాదవ్ మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని మాజీ ఆరోగ్యమంత్రి ఆవాంచ లక్ష్మారెడ్డి సూచించినట్లు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నందిగామ గ్రామపంచాయితీ 14వ .వార్డు సభ్యుడు గంగిశెట్టి చెన్నయ్య తెలిపారు.శనివారం హైదరాబాద్ లంగర్ హౌజ్‌లో ఉన్న మంత్రి స్వగ్రహంలో చెన్నయ్య మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకే అందజేశారు.సిఎం సార్ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలే మంటున్నారు.?ప్రతి పథకం నిరుపేదలకు అందేలా శ్రమించాలని సూచించినట్లు తెలిపారు.అనంతరం మహబూబ్‌నగర్ ఎంపి మన్నె శ్రీనివాస్ రెడ్డిని కలిసినట్లు చెప్పారు.

## కరెంటు సరఫరాలో ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యం

-తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల మహేష్

**తలకొండపల్లి జూలై22,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునంతల ,తుమ్మల కుంట తండాలలో ఐదు రోజులుగా కరెంటు లేక రైతులు ,ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులకు ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోవడం లేదని చివరకు రైతులు తలకొండపల్లి సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తే తప్ప అధికారులు స్పందించలేదని ఆయన మండిపడ్డారు.శనివారం తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.....మా గ్రామాలలో కరెంటు లేకపోవడంతో ఇళ్లల్లోకి పాములు,తేళ్లు వస్తున్నాయని ప్రజలు భాయభ్రాంతులకు గురయ్యారని కనీసం తాగడానికి నీళ్లు లేవని,రైతల వ్యవసాయ పొలాల వద్ద వరి నార్లు,కరిగేట్లు ఎండిపోయాయని విమర్శించారు.ఇప్పటికైనా రైతులు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రజా సమస్యలన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా,సోషల్ మీడియా ఇంచార్జీ అజీమ్,జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్,మాజీ ఎంపిటిసి రాములు,నరేష్ ముదిరాజ్,ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు సాయినాథ్, చెన్నకేశవులు,మాజీ ఉప సర్పంచ్ ,డిగ్రీ కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ బిఆర్ఎస్ అధ్యక్షుడి భార్యను పరామర్శించిన ఎమ్మెల్యే



చికిత్స పొందుతున్న పుష్పలతను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శిస్తున్న దృశ్యం

**తలకొండపల్లి జూలై22,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన మిద్దెల చిన్న హరిమోహన్ రెడ్డి భార్య మిద్దెల పుష్పలత గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుంది.శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చికిత్స పొందుతున్న పుష్పలతను హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని వెల్‌నెస్ ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు.రాంపూర్ బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడి భార్య పుష్పలత 5 రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురైంది.చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ డాక్టర్లను సంప్రదించి ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంటన బిఆర్ఎస్ నాయకులు,మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్,మాజీ జడ్పిటిసి నర్సింహ్మా,నరేష్,మహేష్,తదితరులు ఉన్నారు.

## గురుస్వామిని సన్మానించిన ఎంపిటిసి కుమారస్వామి గౌడ్

**నందిగామ జూలై22,ప్రభాతవార్త :** నందిగామ మండలం అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన ఎంపిటిసి దేపల్లే కుమారస్వామిగౌడ్ శనివారం గురుబ్రహ్మ శ్రీశ్రీశ్రీ సతీషన్ నాయర్ గురుస్వామిని అంగరంగ వైభవంగా సన్మానించారు.అంతిరెడ్డి గూడెంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంకయాల రాంరెడ్డి,నర్సప్పగూడ మాజీ సర్పంచ్ తనయుడు బంటారం సుదర్శనగ్ గౌడ్,నందిగామ మాజీ సర్పంచ్ తనయుడు ఎదిరే శ్రీకాంత్ గౌడ్,దేపల్లే శ్రీశైలం గౌడ్, బంధుమిత్రులు,తదితరులు పాల్గొన్నారు.



గురుబ్రహ్మ శ్రీశ్రీశ్రీ సతీషన్ నాయర్ గురుస్వామిని సన్మానించిన ఎంపిటిసి దేపల్లే కుమారస్వామి గౌడ్,తదితరులు

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంచాల మండలంలో గ్రామ పంచాయితీ కార్మికులు చేస్తున్న సమ్మె దృశ్యం

**ఇబ్రహీంపట్నం, జులై 22, ప్రభాతవార్త:** గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సిఐటియు మండలం కన్వీనర్ పోచమోని కృష్ణ హెచ్చరించారు.మంచాల మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ కార్మికులు చేస్తున్న సమ్మె 17వ రోజుకు చేరింది .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంఘం జెఎస్సి నాయకులను చర్చలకు పిలిచి చీఫ్ సెక్రెటరి లేదని వినతీ పత్రం తీసుకొని వెనక్కి పంపడం విడ్డూరమన్నారు.చర్చలు జరపకుండ సమ్మెను విరమించండి అనడం సరైనదికారన్నారు.చర్యలకు పిలిచే ముందు చీఫ్ సెక్రెటరి అమెరికాకు పోయిందని మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఏది ఏమైన గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె ఆపేది లేదని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.సమ్మెలో గ్రామ పంచాయితీ ఉద్యోగ కార్మికసంఘం అధ్యక్షకార్యదర్శులు ఖాజాపాషా,భాస్కర్, నాయకులు శంకరయ్య,రవి,సురేష్, యాదయ్య తదితరులున్నారు.



సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటించిన ఎమ్మార్పీఎస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కాడిగల్ల ప్రవీణ్‌కుమార్

**మొయినాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఎమ్మార్పీఎస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ శనివారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమ్మె పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. కార్మికులకు శెలవులు, సకాలంలో వేతనాల పెంపు, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయడం వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మె కొనసాగితే మన పరిసరాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని, అనారోగ్యం బారిన పడతామని తెలిపారు. ఈ పరిస్థితి రాకుండా చూస్తున్న కార్మికులకు తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎంఎస్ఎఫ్ కో కన్వీనర్ నాని భానుప్రసాద్, మొయినాబాద్ మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్, శంకర్‌పల్లి కన్వీనర్ మహేందర్ రాజు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన తహసీల్దార్

**షాద్‌నగర్, జూలై 22, (ప్రభాతవార్త) :** ఫరూఖ్‌నగర్ మండల వ్యాప్తంగా ఓటర్ల సవరణ జాబితాను సిద్ధం చేయడానికి శనివారం ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ స్థానిక పెన్షనర్స్ భవనంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటర్ల సవరణ జాబితాను సిద్ధం చేయడానికి కార్యక్రమాన్ని ప్రారంభించామని, బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాను సర్వే చేయాలని ఎన్నికల కమీషనర్ మార్గదర్శకాలు జారీ చేయడంతోఅందుకు అనుగుణంగా మండల వ్యాప్తంగా ఈ ప్రక్రియను ప్రారంబించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి ఓటును బీఎల్వోలు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారని చనిపోయిన వారి ఓట్లు, దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించడం తో పాటు వచ్చే ఎన్నికలల నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు చేపట్టమన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలపై అధికారి ఆనంద్ సింగ్ సూచనలు జారీ చేశారు. మండలంలో ఇప్పటి వరకు 85, 882 ఓట్లు నమోదు ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. మండలంలో పట్టణ కేంద్రంలో 41 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లు ఉండగా మండల రూరల్ స్థాయిలో 98 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్లు, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బూత్ లెవల్ ఆఫీసర్లకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్

# వర్షాలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి : అధికారి గీత



ఎన్నారం గ్రామంలో రైతు పంట పొల్లాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి గీత

**కోట్‌పల్లి, జూలై 22, ప్రభాతవార్త;** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గీత అన్నారు. శనివారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్నారం గ్రామంలో రైతు పంట పొల్లాలను పరిశీలించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ. ప్రతి మొక్కల సాళ్ళ మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా చూడలన్నారు. అధిక వర్షాలతో ప్రత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశం ఉందన్నారు. దీనిని అధికమించడానికి మొక్క వయస్సు బట్టి 10, గ్రాముల పోటాషీయం, నైట్రేట్, లేదా 19,19,19, లీటరు నీటిలో కలిపి పిచ్చాకారి చేయాలన్నారు. పంట ఎదుగుదల పెంచాడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25,కిలోల యూరియా, 10,కిలోల పోటాష్,ఎరువులను మొక్కకు 5, సెంటిమీటర్లు దూరంలో వేసుకోవాలన్నారు. అధిక తేమ వలన ప్రత్తి మొక్కలకు వేరుకుళ్లు, తెగులు సోకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీని నివారణకు 3, గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 1, గ్రాము కార్బండజిమ్ టీలరు నీటికి కలిపి ఆ ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పోదల చూట్టు నేలపై వారం వ్యవధిలో రెండు సార్లు పోయాలని అమె పేర్కోన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఓ



చౌదరిగూడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఓ వెంకటమాదవరావు

**జిల్లెడు చౌదరిగూడ, జులై 22,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఓ వెంకటమాదవరావు శనివారం పరిశీలించారు. గుర్రంపల్లి, వనంపల్లి తుమ్మలపల్లి, ఇంద్రానగర్, ఎల్కగూడ, పద్మారం తదితర గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. వచ్చే ఎన్నికలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## మాల్‌లో లిస్ట్ ఇండోర్స్ డెవలప్‌మెంట్ విద్యార్థుల క్షేత్ర పర్యటన



కారం, పసుపు తయారీని పరిశీలిస్తున్న దృశ్యం

**యాచారం, జూలై 22 ప్రభాతవార్త** జిల్లా డిఆర్‌డిఎ పిడి ప్రభాకర్ ఆధ్వర్యంలో లిస్ట్ ఇండోర్స్ డెవలప్‌మెంట్ పివిటి బెంగుళూరు స్టడీ పర్పస్‌లో భాగంగా ఆసిఫ్, నిఖిల్, అవినాష్, రమాకాంత్ టీమ్ సభ్యులు శనివారం మండల పరిధిలోని మాల్‌లో క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆహార ఉత్పత్తుల్లో భాగంగా రవ్వలు ఏ విధంగా తయారీ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మేడిపల్లి గ్రామాన్ని సందర్శించారు. పిండి తయారీ, పసుపు, కారం తయారీ ఏ విధంగా చేస్తున్నారో వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, డిపిఎం, డిఆర్‌డిఎ శిరీష, ఎపిఎం డిఆర్‌డిఎ సుదర్శన్‌రెడ్డి, ఎపిఎం, సిసిలు పాల్గొన్నారు.

## మేడ్చల్ బీఆర్ఎస్ యూత్ ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్

**ఘట్‌కేసర్, జూలై 22, ప్రభాతవార్త:** మేడ్చల్ నియోజకవర్గ రూరల్ బీఆర్ఎస్‌పార్టీ యువజన విభాగం ప్రధానకార్యదర్శిగా ఎర్రోళ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సమక్షంలో మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ చామకూర మహేందర్‌రెడ్డి ఆయనను నియమించారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామానికి చెందిన వార్డుసభ్యులు శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలో చురుకుగా పనిచేస్తుండటంతో ఆయనను మేడ్చల్ రూరల్ యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, శివశంకర్, ఉపసర్పంచ్ లింగేశ్వరరావు, సహకార సంఘం డైరక్టర్ ధర్మారెడ్డి, మాజీ డైరక్టర్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**షాద్‌నగర్, జూలై 22, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని కీర్తి వెంచర్ ప్రాంతంలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు. భిక్షాటన చేసుకునే వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. కీర్తి వెంచర్ వద్ద ఓ డ్రైనేజీ కాలువలో శవం కొట్టుకొచ్చినట్లు స్థానికులు సమాచారం అందించినట్లు సీఐ ప్రతాప్ లింగం తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.

## గాంధీనగర్ అభివృద్ధికి కృషి చేస్తా

-ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని కలిసిన గాందినగర్ దళిత యువజన సంఘం నూతన కార్యవర్గం

**కోడంగల్ జులై22,ప్రభాతవార్త;** కోడంగల్ పట్టణ కేంద్రంలోని గాంధినగర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు.శనివారం కోడంగల్ అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా స్థానిక ఇందిరానగర్ కాలనీలో ఉన్న సమస్యల గురించి,వాటి పరిష్కార మార్గాల గురించి ఆయనతో చర్చించారు. కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల శిథిలావస్తలో ఉందని ఎస్సీల కమ్యూనిటి హాల్ మరియు 2ఎకరాల స్మశాన వాటిక స్థలానికి స్థలాన్ని కేటాయించాలని వారు వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.మరుగుదొడ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ద వహించి సామూహిక మరుగుదొడ్లు నిర్మించేందుకు కుషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ విషయాలపై తక్షణం స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్థానని తెలిపారు.కోడంగల్ నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా బిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ కమిటి నూతల అద్యక్షుడు కే.చంద్రశేఖర్,ఉపాద్యక్షుడు ఎ.రమేష్, జి.అశోక్, ప్రదాన కార్యదర్శి కె.ఆర్.మధుకుమార్,డి.కేశవులు.అంబేద్కర్ యువజన సంఘ తాలుకా అద్యక్షుడు యు.రమేష్‌బాబు,బిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ జి.రమేష్‌బాబు,కే.దస్తప్ప,జి.జగన్మోహన్ మరియు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



సీఎం సహాయనిధి ఎల్‌ఓసిని అందజేస్తున్న ఎమ్మెల్యే

**షాబాద్, జూలై 22, ప్రభాతవార్త :** సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శనివారం మండలానికి చెందిన తిమ్మారెడ్డిగూడ గ్రామానికి చెందిన ముద్దెంగూడ అనిత రూ.2లక్షల50వేలు సీఎం సహాయనిధి ఎల్‌ఓసిని భర్త ముద్దెంగూడ శేఖర్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మెన్ మద్దూర్ మల్లేష్ తదితరులు ఉన్నారు.

# రహదారి ఇలా....పోయేదేలా..!

-ఎమ్మెల్యేసారూ మా రోడ్డుకు మోక్షం కల్పించండి



**నందిగామ జూలై22,ప్రభాతవార్త :** ఎమ్మెల్యే సారూ మా రహదారికి మోక్షం కల్పించండని రంగాపూర్,పెంజర్ల, కోడిచర్ల వాసులు స్థానిక ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్‌ను మొరపెట్టుకుంటున్నారు.నందిగామ మండలం రంగాపూర్ గ్రామం నుండి స్మశాన వాటిక మీదుగా పెంజర్ల వెళ్లే రహదారి గోతులమయమై అస్తవ్యస్తంగా తయారైందని ,ప్రజాప్రతినిధులను,అధికారులను మొరపెట్టుకున్న ఫలితం కానరాలేదని రైతులు,బాటసారులు,కార్మికులు ఆవేదన వెల్లగక్కారు.ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన కూరగాయాలను ,ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించాలన్న రోడ్డు దుస్థితితో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.శ్మశాన వాటికకు వెళ్లలంటేనే రహదారి దుస్థితి చూసి వాహనదారులు,రైతులు ,బాటసారులు వెనకంజ వేస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు.

## వృద్ధుడికి చేయూత

**తలకొండపల్లి జూలై22,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన వట్టేల ఎల్లయ్య జ్వరంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ 2వేల రూపాయల చేయూతనందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్,వార్డు సభ్యుడు శ్రీరామ్,జగన్,తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

- శేరి నర్సింగరావు వెల్లడి

**శంకర్‌పల్లి, జూలై 22 ప్రభాతవార్త:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీలో ఉంటానని చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామ నివాసి శేరి నర్సింగరావు తెలిపారు. శనివారం ఆయన శంకర్‌పల్లిలోని గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలోనే ఏ పార్టీ నుంచి పోటీలో ఉంటానో ఆ పార్టీ పేరు ప్రకటిస్తానని చెప్పారు. ఎన్నికల సమయం వచ్చే వరకు గ్రామాల్లో తన అనుచరులతో కలిసి తన అభిప్రాయాలను తెలుపుతానని అన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ఎంతో తృప్తి ఉంటుందని ఆయన తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తనకు అందరితో పరిచయాలు ఉన్నాయని చెప్పారు. తనకు 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని, ప్రజల కష్టాలు ఏమిటో తనకు తెలుసునని అన్నారు. అందువల్లే ఈసారి చేవెళ్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీలో ఉంటానని తెలిపారు. త్వరలోనే ఏ పార్టీ నుంచి పోటీ చేసే అవకాశం ఉంటుందో తెలియజేస్తానని అన్నారు.

## కాంగ్రెస్ సేవాదళ్ శిక్షణకు హాజరైన తలకొండపల్లి నాయకులు



**తలకొండపల్లి జూలై22,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల నుంచి సేవాదళ్ నాయకులు తరలివెళ్లారు.రంగారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిల్లి వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సద్గురు రావు,తలకొండపల్లి మండల అధ్యక్షుడు కానుగుల దశరథంతో పాటు ఆయా మండలాల కార్యకర్తలు,తరలివెళ్లారు.ఈనెల 13 నుంచి కర్ణాటక రాష్ట్రంలోని జలగం జిల్లా పరిధిలోని కట్టపు సెంటర్ కేంద్రంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్,రాష్ట్ర అధ్యక్షుడు పోన్నాల సుబ్రహ్మణ్యములు హాజరై ప్రస్తుత సమయంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.దేశంలో జరుగుతున్న అనేక సంఘటనలకు దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం కారణమని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని గద్దె దించేం దుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు విరామం లేకుండా కృషి చే యాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిల్లి వెంకట రెడ్డి, కల్వకుర్తి తాలూకా నాయకులు కానుగుల దశరథం,తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం అందరి బాధ్యత



పద్మారం రోడ్డుపై మొక్కలు నాటుతున్న డిఎల్‌పిఓ మల్లారెడ్డి

**జిల్లెడు చౌదరిగూడ, జులై 22,(ప్రభాతవార్త):** గ్రామాల్లో మొక్కలు నాటి పెంచడం అందరి భాద్యతగా తీసుకోవాలని డిఎల్‌పిఓ మల్లారెడ్డి అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పద్మారం రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటె కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తెలంగాణకు హరిత హారం కార్యక్రమం ద్వార గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాలు పంచుకుని మొక్కలు పెంచాలని అన్నారు. గ్రామాల్లో మొక్కలు పెంచడం వల్లన కాలుష్య నివారణ జరుగుతుందని అన్నారు. అనంతరం ఎల్కగూడ గ్రామంలో నూతనంగ నిర్మిస్తున్న గ్రామ పంచాయితీ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మహేష్‌బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మారెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల బాలికల పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

-ఎమ్మార్పీఎస్ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ మాదిగ

**మొయినాబాద్, జూలై 22 ప్రభాతవార్త:** మొయినాబాద్ మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన ప్రదేశాన్ని ఎమ్మార్పీఎస్ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ శనివారం సందర్శించారు. పాఠశాల, వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల భయంతో పరుగులు తీయడం చాలా బాధాకరమని అన్నారు. వర్షం వల్ల తరగతి గదుల్లోకి నీరు రావడం, వసతి గృహంలో సదుపాయాలు లేక విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రస్తుత భవనానికి అన్ని రకాల మరమ్మతులు చేయాలని, ఈ భవనం సరిపోవడం లేనందున కొత్త భవనం నిర్మించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎంఎస్ఎఫ్ కో కన్వీనర్ నాని భాను ప్రసాద్, ఎమ్మార్పీఎస్ మొయినాబాద్ కన్వీనర్ మహేందర్, కో కన్వీనర్ రాజు, సీనియర్ నాయకులు శ్రీను, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాల్గొన్నారు.



సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన ఎమ్మార్పీఎస్ చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ

# వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలి : కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
గత నాలుగు రోజులుగా జిల్లాలో నిరంతరాయంగా వర్షాలు పడి తగ్గుముఖం పట్టినందున వ్యాధులు ప్రబలకుండా అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు.శనివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ..వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువలలో చెత్తాచెదారం,గుంతలలో రోడ్లపై నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపట్టాలని అన్నారు.తాగునీరు కలుషితం కాకుండా అన్ని ట్యాంకులను పరిశుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు.నీటి సరఫరా పైప్‌లైన్లలు లీకేజీలు లేకుండా మిషన్ భగీరథ అధికారులు పరిశీలించుకోవాలని సూచించారు.స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని వచ్చే మూడు రోజులు పరిశుభ్రతపై దృష్టి సారించి ప్రజలు రోగాల బారిన పడకుండా అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు.జిల్లా వైద్యశాఖ అధికారులు తమ పరిధిలో వర్షాల కారణంగా సంభవించే సీజనల్ వ్యాధులు,జ్వరాలు ప్రబలకుండా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని మూడు రోజుల పాటు డ్రైడే పాటించాలన్నారు.ఆశావర్కర్లను అన్ని గ్రామాలలో ఇంటింటికి పంపి దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయడం దోమల మందు పిచికారి చేయించాలన్నారు.పాత తొట్టెలు,టైర్లు,డబ్బాలలో నీరు నిలవకుండా చూడాలన్నారు.జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం ,స్వచ్ఛమైన తాగునీరుతో పాటు ,వైద్య సేవలను మూడు రోజుల పాటు పటిష్టంగా చేపట్టాలన్నారు.వర్షాలు సమృద్ధిగా కురిసినందున హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులందరూ సిద్ధం కావాలని కలెక్టర్ అన్నారు. వచ్చే సోమవారం నుండి శనివారం వరకు హరితహారం కార్యక్రమం చేపట్టి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యంలో 80శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.ఈసారి హరిత హారం కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని తూతూమంత్రంగా నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.అవెన్యూ ప్లాంటేషన్‌కు కనీసం 6మీటర్లు తగ్గకుండా పెద్ద సైజు మొక్కలను నాటాలని సూచించారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని మొక్కల నాటక ముందే ట్రీ గార్డులు, కావలాదారులను నియమించుకోవాలని అన్నారు.గ్రామ పంచాయతీలలో జీపీ బిల్డింగుల నిర్మాణం కొరకు ఇప్పటివరకు స్థలాల సేకరణ జరగలేదని,అట్టి జీపీలకు వెంటనే స్థల సేకరణ పనులను చేపట్టి నివేదిక అందించాలన్నారు.30లక్షలకు తక్కువ ఖర్చుతో చేపట్టే మన ఊరు -మనబడి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు.ఆయిల్ ఫామ్ పంటల సాగు కొరకు జిల్లాలో రైతులను గుర్తించి వారి నుండి డిమాండ్ డ్రాఫ్ట్‌లను సేకరించాలని అన్నారు.వర్షాల కారణంగా రైతులకు నష్టం వాటిల్లకుండా క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, ఎంపిడివోలు,ఎంపివోలు, కమిషనర్ మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు,పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం



అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**కొడంగల్ రూరల్, జులై 22 (ప్రభాతవార్త) :**
కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నీ పార్టీల నాయకులు, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కొడంగల్ మండలాల తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికలు, పోలింగ్ బూత్‌ల వివరాలు తదితర అంశాలపై సమీక్షించారు. నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వివరాలను వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు బుచ్చయ్య, వివిధ పార్టీల నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మణిపూర్ సంఘటనలో నిందితులకు ఉరి శిక్ష విధించాలి

**అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శ్యామ్ సుందర్**

**దౌల్తాబాద్, జులై 22 ప్రభాతవార్త :** మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటనలో నిందితులకు ఉరి శిక్ష విధించాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శ్యామ్ సుందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ పాలనలో మతాల మధ్య చిచ్చు రేపుతూ నిత్యం ఏదో ఓ చోట అల్లర్లు, రేప్‌లు, హత్యలు జరుగుతూనే ఉన్నా పట్టించుకోకపోవడం ధారుణం అని ఆరోపించారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రి జోక్యం చేసుకొని నిందితులకు ఉరి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## కవి దాశరథి కృష్ణమాచార్య జయంతి



కవి దాశరథి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

**కొడంగల్ రూరల్, జులై 22 ప్రభాతవార్త:**
అనంత సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను జరుపుకున్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలం, గళంతో యావత్ తెలంగాణ ప్రజలను చైతన్యపర్చిన మహాయోధుడు దాశరథి అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో అనంత వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు, కవి రచయిత మాసాని వెంకటయ్య, జాతీయ విద్యారత్న అవార్డు గ్రహీత ఎరన్‌పల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు బత్తుల మల్లయ్య, పండరి, లక్ష్మీనారాయణ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండరాదు : ఎంపిడిఓ లక్ష్మప్ప



ఇందూరులో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న యంపిడిఓ

**పెద్దేముల్, జులై 22, ప్రభాతవార్త:**
భారీ వర్షాలకు శిథిలావస్థలో ఉన్న, మట్టి గోడలతో ఉన్న, ఉధృతంగా ప్రవహించే నాలాల దగ్గర ఉన్న ఇండ్లలో ఉండరాదని, అవి ఊహించని విధంగా కూలిపోయి ప్రాణ నష్టం సంభవించే ప్రమాదముందని యంపిడిఓ లక్ష్మప్ప అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పెద్దేముల్ మండలంలోని ఇందూరులో షేక్ అన్సర్, షేక్ ఖాదర్, పోతుగంటి ఆశమ్మ ఇళ్ళు దెబ్బతినడంతో శనివారం యంపిడిఓ లక్ష్మప్ప వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా యంపిడిఓ లక్ష్మప్ప మాట్లాడుతూ వర్షానికి తడిసిన విద్యుత్ స్థంబాలను, గోడలను తాకరాదని అన్నారు. వరద నీటికి చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదముందని వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిన్న పిల్లలు, ఈతరాని వారు ఎట్టి పరిస్థితులలో చెరువులోకి ఈతకు గాని చేపల వేటకు గాని వెళ్లరాదని అన్నారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. యంపిడిఓ వెంట సర్పంచ్ ఎస్.పద్మ, పంచాయతీ కార్యదర్శి రాజు, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు ఎస్.మొగులప్ప తదితరులు ఉన్నారు.

## ఇంద్రానగర్‌లో మొక్కల పంపిణీ



గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపిడిఓ మహేష్‌బాబు

**జిల్లెడు చౌదరిగూడ, జులై 22,(ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ గ్రామంలో శనివారం ఎంపిడిఓ మహేష్‌బాబు గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేసేందుకు ఆదేశాలు జారి చేసినట్లు తెలిపారు. మొక్కలు తీసుకున్న ప్రజలు తమ ఇళ్ల వద్ద తప్పని సరిగా మొక్కలు పెంచాలని అన్నారు. మొక్కలు పెంచుకోవడం వల్లన పర్యావరణ పరిక్షణ జరుతుందని ఆయన పెర్కొన్నారు. పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మొక్కలు పెంచే కార్యక్రమంలో పాల్గొని వాటిని కాపాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మారెడ్డి, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్టు...రిమాండ్‌కు తరలింపు

**కొడంగల్ రూరల్, జులై 22 ప్రభాతవార్త:**
కొడంగల్ పట్టణంలోని ఇంద్రానగర్‌లో గత రెండు రోజుల క్రితం జరిగిన చోరి కేసులో ఇద్దరిని అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాములు తెలిపారు. గత రెండు రోజుల క్రితం పట్టపగలు కాలనీలో దేశాయి లక్ష్మమ్మ ఇంటి తాళాలు పగలగొట్టి చోరికి పాల్పడ్డారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.




విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రాములు

## రాంపూర్ యువతకు ఏమైంది?

**-వివిధ కారణాలతో పలువురు మృతి**
**-వారంలో ఇద్దరు యువకులు ,ఒక బాలిక మృతి**
**-ఆందోళనలో గ్రామస్థులు...అధికారులు ధైర్యం చెప్పాలి**

**తలకొండపల్లి జులై22,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోని పలువురు వివిధ కారణాలతో మృతి చెందారు.గత కొంత కాలంగా గ్రామానికి చెందిన యువతి, యవకులు ముఖ్యంగా ఏదో ఒక కారణాంతో మృతి చెందుతున్నారు.దీంతో గ్రామ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.ఈ నెల 16న శ్రీను తన పుట్టిన రోజు వేడుకల కోసం యాదగిరి గుట్టకు స్నేహితులతో కలిసి వెళ్తు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు.చిన్న వయస్సున్న సప్పిడి శ్రీను మృతి చెందాడంతో గ్రామస్థులు కన్నీరుమున్నీరు కాల్చారు.ఇతని దనకర్మ ముగియకముందే ఇదే గ్రామానికి చెందిన కటికేల చందు యాదవ్ (20) ఈనెల 20న మృతి చెందిన సప్పిడి శ్రీను 5 రోజులకు వెళ్లి రాత్రి సమయంలో రాంపూర్ గ్రామశివారులోని మిత్రుల పోలం దగ్గర ఊరిసుకొని మృతి చెందాడు.ఇతని దహన కార్యక్రమాలు ఈ నెల 21న నిర్వహించి గ్రామస్థులందరు ఇంటికి రాగానే ఇదే గ్రామానికి చెందిన కటికేల శిరిష (19) అనే బాలిక తన అత్తగారి ఊరైన తిమ్మజీ పేట్ మండలం నేరళ్లపల్లి గ్రామంలో ఊరేసుకొని మృతి చెందింది. దీంతో ఒక వారం రోజులోని ఇద్దరు యువకులు,ఒక యువతి మృతి చెందాటం పట్ల గ్రామస్తులు అందరూ తీవ్ర ఆందోళనకు గురైతున్నారు.గత 6 నెలలుగా రాంపూర్ గ్రామంలో వరసగా ఏదో ఒక కారణంతో 10 నుంచి 12మంది వరకు మృతి చెందారు.గత 3 నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన హరీష్ రెడ్డి (20) అనే యువకుడు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆమనగల్లులోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు.డాక్టర్ నిర్లక్ష్యంతో నిండు భవిష్యత్తున్న హరిష్ రెడ్డి ఆసుపత్రిలో మృతి చెందాడు.దీంతో గ్రామస్థులందరూ ఆస్పత్రిపై ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించి నిరక్ష్యంగా వ్యవహరించి ఆమనగల్‌లోని ప్రైవేట్ స్వాతి ఆప్పత్రి డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరగా మృతునికి చావుకు బాధ్యత వహిస్తూ కొంత నగదు ఇచ్చి కేసు మాఫీ చేసుకున్నారు.అంతకుముందు ఇదే గ్రామానికి చెందిన లిక్కల నర్సింహ్మా,లిక్కల చంద్రమ్మలు ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా మృతి చెందారు.ఈ విధంగా గ్రామానికి చెందిన పలువురు అట్టహాసంగా మృతి చెందాటంతో గ్రామ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.రాంపూర్ గ్రామంలోని ప్రజలు బిక్కుబిక్కుమంటు ఆందోళన చేందుతున్నారు.కావున అధికారులు స్పందించి గ్రామ ప్రజలకు,మరియు యువకులకు చైతన్యం తీచ్చే విధంగా కృషి చేయాలని,అదే మాదిరిగా గ్రామ ప్రజలకు ధైర్యం నింపాలని కోరుతు పలువురు మండల ప్రజలు కోరుతున్నారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి: ఎంపిపి



అవుశాపూర్‌లో పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతుగా చెత్త సేకరించే ట్రాక్టర్‌ను నడిపుతున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, జులై 22, ప్రభాతవార్త:**
పారిశుధ్య కార్మికులు 20 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తుందని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతుగా శనివారం అవుశాపూర్ గ్రామంలో చెత్త సేకరించే ట్రాక్టర్ నడపడంతో పాటు వారితో కలిసి చెత్త సేకరించి సంఘీభావం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల పారిశుధ్య కార్మికులు గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికశాఖ మంత్రిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి వారిని పలకరించకపోవడం వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించకపోవడం ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్ష చూపుతుందనడానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ ఏర్పడితే కాంట్రాక్టు ఉద్యోగులు ఉండరని చెప్పినా సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికులను పట్టించుకోవడం లేదని అన్నారు. పారిశుధ్య కార్మికుల పనితీరుతోనే రాష్ట్రానికి 18 జాతీయ అవార్డులు వచ్చాయని వారి సేవలను గుర్తించి అయినా వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కరోనా వ్యాధి సమయంలో ప్రాణాలకు ఎదురొడ్డి విధులు నిర్వహించినా పారిశుధ్య కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ డిమాండ్ చేశారు.

## తుమ్మ చెరువు నీరు పోయేందుకు శాశ్వత పరిష్కారం చేపట్టాలి

**మేడ్చల్, జులై 22. ప్రభాతవార్త :**
మేడ్చల్‌లోని తుమ్మ చెరువు బారి నుండి తమను కాపాడాలని కలెక్టర్‌నఉ కోరుతున్నామని పట్టణంలోని వినాయక్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికవాసులు అన్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ మేడ్చల్ వినాయక్ నగర్ కాలనీ పై భాగంలో ఉన్న తుమ్మ చెరువు మత్తడి లేకుండా ఇండ్లు నిర్మించడంతో నిండిన నీరు బయటకు వెళ్లే వీలు లేకుండా మారడంతో వర్షాలకు చెరువు నిండి ప్రమాదకరంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాలుగా వర్షాలకు నిండిన నీటిని తూము ద్వారా బయటకు వదలడంతో చెరువు కింది ఉన్న ఈ కాలనీ గుండా వానా కాలం మొత్తం నీరు పారుతూనె ఉంటుందని ఆరోపించారు. ఏకదాటిగా వానలు కురుస్తే ఇండ్లలోని ప్రజలు రాత్రింబగలు బిక్కుబిక్కుమంటు గడపాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ విషయమై గతంలో కలెక్టర్ గారిని వినతి పత్రం అందజేసి నీరు బయటకు వెళ్లే విదంగా చర్యలు తీసుకోవాలన కోరగా జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. కాని ఇంతవరకు ఏ అధికారి గాని చెరువు వద్దకు వచ్చి సర్వే చేసిన పాపాన పోలేదని, అందుకు తహసీల్దార్, సర్వేయర్, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగి సర్వే చేయాలని కోరుతూ వినతి పత్రాలు కూడ అందజేశామని తెలిపారు. ఈ ఏడు కూడ కురుస్తున్న వర్షాలకు చెరువు నిండుకుంటున్నదని, ఎవరు పట్టించుకోకపోవడంతో తమ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని చెరువు నిండి సమయంలో నీరు బయటకు పోయేందుకు శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి. కార్యదర్శి పాండుగుప్త, కోశాదికారి రాంచందర్ గుప్త, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్, సభ్యులు రాజుగౌడ్, సాంబమూర్తి, మహేందర్‌రెడ్డి, మల్లేష్, శైలేందర్, శంకర్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో వినాయక్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు

## వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-కౌన్సిలర్ తల్లోజు విజయ్‌కృష్ణ**



7వవార్డులో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న కౌన్సిలర్ తల్లోజు విజయ్‌కృష్ణ

**ఆమనగల్లు, జులై22, ప్రభాతవార్త:**
ఉపరితల ఆవర్తన ధోరణితో కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమనగల్లు మున్సిపాలిటీ 7వవార్డు కౌన్సిలర్ తల్లోజు విజయ్‌కృష్ణ అన్నారు. నివాసాల మధ్య నిలువ నీరు ఉండకుండా చూసుకోవాలని, నీరు నిలిచి ఉంటే దోమల వ్యాప్తి పెరిగి పోయి రోగాల బారిన పడే అవకాశాలు ఉంటాయని ఆయన వివరించారు. శనివారం మున్సిపాలిటీ సిబ్బందితో వార్డులోని పలు కాలనీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను వెంటనే బాగు చేయించారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రమాణాలు పాటించి పరిశుభ్రమైన వార్డుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలతో మెలగాలని తల్లోజు విజయ్‌కృష్ణ కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## మొదటి నెల జీతంతో మొక్కు తీర్చుకున్న భక్తురాలు



ఆలయంలో మొక్కు తీర్చుకుంటున్న భక్తురాలు దివ్య శివకిషోర్

**యాచారం, జులై 22 ప్రభాతవార్త**
మొదటి నెల జీతంతో కొలువుల తల్లి జ్ఞానసరస్వతి దేవి అమ్మవారికి ఓ భక్తురాలు మొక్కు తీర్చుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని నజ్దిక్ సింగారం గ్రామానికి చెందిన మారోజు శంకరన్ కోడలు దివ్య శివకిషోర్ కొలువుల కల్పవల్లిగా విరాజిల్లుతున్న నందివపనపర్తి జ్ఞానసరస్వతి అమ్మవారిని దర్శించుకుని ఉద్యోగం వచ్చేలా అనుగ్రహించమని అమ్మవారిని వేడుకున్నారు. ఈ క్రమంలో ఆమెకు అమెరికాలోని టెక్సాస్‌లో చేజ్ బ్యాంకులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించారు. ఉద్యోగం వచ్చిన తరువాత శనివారం కుటుంబ సభ్యులతో కలిసి జ్ఞానసరస్వతి దేవి అమ్మవారిని దర్శించుకుని తన తొలి వేతనం 900 డాలర్లు(రూ. 73,791)లను సేవా సమితి సభ్యులకు అందజేశారు.

## భారత సైనికుని భార్యకు భద్రత ఇవ్వలేని బిజెపి ప్రభుత్వం

**యాచారం, జులై 22 ప్రభాతవార్త**
భారత సైనికుని భార్యకు భద్రత ఇవ్వలేని బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉండడం దేశానికి సిగ్గు చేటని ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు మండలగోపాల్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత బిడ్డలకు ఎలాంటి భరోసా ఇస్తుందని, తక్షణమే దేశంలో ఉండే మహిళలకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణలు చెప్పాలన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నం ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బిజెపి ప్రభుత్వంలో దళిత, గిరిజన స్త్రీలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. దేశ ప్రజలందరూ రానున్న రోజుల్లో బిజెపిని బొంద పెట్టడం ఖాయమన్నారు. బిజెపి పాలనలో దేశం తలదించుకునేలా సంఘటనలు జరగడం సిగ్గుచేటని విమర్శించారు.

## సమాజ శ్రేయస్సుకే సైకిల్ యాత్ర

**కీసర,జులై22,ప్రభాతవార్త:**
జల,జంతు,వన సంరక్షణ నినాదంతో ఒకరు నెలల తరబడి సైకిల్‌పై దేశయాత్ర సాగిస్తున్నారు.కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింగనూరులో ఉంటున్న చాత్రాతి విజయ గోపాలక్రిష్ణ యాత్ర చేస్తూ శనివారం కీసర మండల కేంద్రానికి చేరుకున్నారు.కీసరలోని శ్రీ రామాలయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.గోపాలక్రిష్ణ 2022 మార్చి 11న స్వగ్రామం నుంచి బయలుదేరి 560 రోజుల్లో 16 రాష్ట్రాలు అనేక దర్శనీయ దేవాలయాలు అడవులు,జంతువులు,నదులను సందర్శించినట్లు తెలిపారు.ఈ యాత్ర మరో కొన్ని రోజుల పాటు సాగించనున్నట్లు వివరించారు.తమ పూర్వికులది ఏపీలో తణుకు మండలం కొమరవరం గ్రామమని 1971లో రాయచుర్కు వెళ్లి స్థిరపడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుతం భద్రాచలం మీదుగా ఛత్తీస్‌గఢ్ వెళ్లనున్నట్లు చెప్పారు.ఎక్కడకు వెళ్లినా అక్కడ సంస్కృతి సంప్రదాయాలతో తనకు స్వాగతం పలుకుతున్నారని వారందరికి చాత్రాచి విజయగోపాలక్రిష్ణ సైకిల్ యాత్ర రుణపడి ఉంటారన్నారు.కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని కొమురవెల్లి శ్రీ మల్లిఖార్జున స్వామి వారిని,యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నృసింహ్మాస్వామి వారిని దర్శించుకుని హైదరాబాద్‌కి బయలుదేరుతానని ఆయన తెలిపారు.



సైకిల్ యాత్రలో భాగంగా కీసరకు వచ్చిన గోపాలక్రిష్ణ

## దుద్యాల మండల నాయబ్ ఖాజీగా మహమ్మద్ మోయిజ్



నియామక పత్రం అందుకున్న మహమ్మద్ మోయిజ్

**బోంరాస్‌పెట్, జులై 22, ప్రభాతవార్త:**
దుద్యాల మండల నాయబ్ ఖాజిగా మహమ్మద్ మోయిజ్ నియామకం అయ్యారు. ఈ మేరకు శనివారంతాండూరులోని తజ్విదుల్ ఖురాన్ మదర్సా నందు తాండూరు,కోడంగల్ నియోజకవర్గాల ఖాజీ మౌలానా షబ్బీర్ సాబ్ దుద్యాల మండలానికి నాయబ్ ఖాజీగా మండల కేంద్రానికి చెందిన మౌలానా మహమ్మద్ మోయిజ్‌ను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. దుద్యాల మండలంలో జరిగే ముస్లీం వివాహాలను ఇప్పటి నుంచి నాయబ్ ఖాజీ మౌలానా మహమ్మద్ మోయిజ్ నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా మోయిజ్‌తో పాటు దుద్యాల మజీద్ సదర్ సయ్యద్ రఫీ, ఇమామ్ జావిద్, సెక్రెటరి ఫరీద్, సభ్యులు ఇక్బాల్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్ఐ శంకర్

**బోంరాస్‌పెట్, జులై 22, ప్రభాతవార్త:**
ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బొంరాస్‌పెట్ ఎస్ఐ శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ వర్షాలకు తడిసిన విద్యుత్ స్థంభాలను గోడలను తాకరాదని, వాటికి వచ్చే కరెంటు షాక్ ద్వారా ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంటుందని అన్నారు. ఇంటి పై కప్పుగా వేసిన ఇనుప రేకులను తాకరాదని అన్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్ద, బోర్‌ల వద్ద కరెంటు పెట్టె ముందు తడిసిన స్టార్టర్ బాక్స్‌లను, ఫ్యూజులను చేతులతో ముట్టుకోరాదని సూచించారు. వర్షానికి రోడ్లపై గుంతలు పడి అందులో నీరు నిలిచి ఉండటం వల్ల వాహనదారులకు కనబడక ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనదారులు దాటడానికి సాహసం చేయరాదని అన్నారు. వర్షాకాలంలో ప్రజలందరు జాగ్రత్తలు పాటిస్తు వరదల పట్ల అప్రమత్తంగా ఉంటు, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

## పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోండి : ఏఓ తులసీరాం

**పూడూరు, జులై 22, ప్రభాతవార్త :**
2023..24 సంవత్సరానికి గాను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీహామీ పథకం కింద పండ్లతోటలు పెంపకానికి ఆసక్తిగల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకానికి ఎస్‌సి,ఎస్‌టి,సన్న,చిన్నకారు,5 ఎకరాలలోపు భూమిఉన్న రైతులు అర్హులన్నారు.పండ్ల తోటలు పెంచదలుచుకున్న రైతులు బోరుబావి, విద్యుత్తు సరఫరా కలిగి ఉండి,ఉపాధీహామీ జాబ్‌కార్డు కూడా ఉండాలన్నారు. మామిడి,జామ,నిమ్మ, దానిమ్మ,సీతాఫలం,మునగ,కొబ్బరి (గట్లవెంబడి మాత్రమే)సపోట,ఆయిల్‌ఫామ్,బత్తాయి,అల్లనేరెడు,డ్రాగెన్ ఫ్రూట్ తదితర పండ్ల తోటలు పెంచదలచిన రైతులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఇందుకోసం రైతు దరఖాస్తు పత్రంతోపాటు పట్టా పాసుబుక్కు,బ్యాంక్ అకౌంట్ బుక్కు,ఆధార్‌కార్డు,ఉపాధీ జాబ్‌కార్డు జిరాక్స్ కాపీలు,3 పాస్‌ఫోటో సైజ్ ఫోటోలు,గ్రామ పంచాయతీ తీర్మానానికి జతపరచి సంబంధిత ఎఇఓలకు సమర్పించాలని వివరించారు.

## రాంపల్లిదాయర గ్రామాన్ని అభివృద్ధి చేస్తా



రాంపల్లిదాయర గ్రామంలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ భద్రారెడ్డి

**కీసర,జులై22,ప్రభాతవార్త:**
రాంపల్లిదాయర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ భద్రారెడ్డి అన్నారు.శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సొంత నిధులతో సుమారు 10 లక్షలతో సీసీ రోడ్లకు,పెండింగ్‌లో ఉన్న మహిళా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ స్కూళ్లను సందర్శించి మౌళిక వసతులు కల్పిస్తానని తెలిపారు.గ్రామ పరిధిలోని ఇంద్రనగర్ కాలనీలో,వెంకటేశ్వర కాలనీలో సీసీ రోడ్లను వేయిస్తానని చెప్పడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ గరుగుల ఆండాలు మల్లేష్ మాట్లాడుతూ పూర్తికాని మహిళా భవనం,దళితవాడలో చిన్న చిన్న ఫంక్షన్‌లు చేసుకోవడానికి వీలుగా షెడ్డు నిర్మాణము,సీసీ రోడ్ల గురించి మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఇట్టి కార్యక్రమాలు డాక్టర్ భద్రారెడ్డి గారితో చేయించడం సంతోషకరమైన విషయమన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాడి రాము,కందాడి శ్రీకాంత్‌రెడ్డి,మహేందర్,శ్యామల,చంద్రకళ,విజయ,గ్రామశాఖ అధ్యక్షులు బాలక్రిష్ణ,కో ఆప్షన్ సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దామగుండం అడవిలో కుక్కల దాడిలో జింక మృతి

**పూడూరు, జులై 22, ప్రభాతవార్త :**
కుక్కలదాడిలో ఓ జింక మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవిలో చోటు చేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం పూడూరు గ్రామ సమీపంలో ఉన్న దామ గుండం అటవీ ప్రాంతంలో జింకలతో పాటు వివిధ రకాల వన్యప్రాణులు జీవిస్తుంటాయి.అయితే గత రెండు నెలల కిందకూడా కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందగా,తాజాగా శుక్రవారం కుక్కల దాడిలో మరో జింక మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది.అయితే కుక్కల దాడిలో జింకలతోపాటు ఇతర వన్యప్రాణులు మృతి చెందిన సంఘటనలు చాలా ఉన్నాయని,ఇలాగే నిర్లక్షం చేస్తే అడవి లో వన్యప్రాణులు కరుమరుగయ్యే ప్రమాదం ఉందని, వీటి రక్షణకోం అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పూడూరు గ్రామ ఉప సర్పంచ్ టి రాజేందర్,సత్యానందస్వామి తదితరులు కోరారు.



పూడూరు మండలం దామగుడం అడవిలో మృతి చెంది ఉన్న జింక